అసంపూర్తి నిర్మాణానికి మోక్షమెప్పుడో!

- శ్మశాన వాటికలో నిరుపయోగంగా మారిన క్రిమిటోరియం యూనిట్
- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.1.40 కోట్లతో నిర్మాణం
- ఇప్పటికే 75 శాతం పనులు పూర్తి
- మిగులు పనులు చేపట్టడంలో తాత్సారం



అమలాపురం శ్మశాన వాటికలో నిర్మితమైన క్రిమిటోరియం భవనం



క్రిమిటోరియం యూనిట్

అమలాపురం టౌన్: కోవిడ్ సమయంలో ఆ వైరస్ బారిన పడి అనేక మంది ప్రాణాలు గాలిలో కలిసి పోతున్న తరుణంలో ఆ మృతదేహాలకు అమలాపురంలోని శ్మశాన వాటికల్లో అంతిమ సంస్కారాలు నిర్వహించడం కొంచెం కష్టతరమయ్యేది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందు చూపుతో పట్టణంలోని మున్సిపల్ కాలనీ శివారులో ఉన్న శ్మశాన వాటిక (కైలాస భూమి)లో రూ.1.40 కోట్ల వ్యయంతో క్రిమిటోరియం (శవాలను ఎలక్ట్రికల్ మెషీన్‌తో దహనం చేసే యూనిట్) మంజూరు చేసింది. 2022 సంవత్సరంలో పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లు యూనిట్ నిర్మాణాన్ని చేపట్టారు. రూ.1.40 కోట్లతో క్రిమిటోరియం మెషీన్ యూనిట్‌ను, అందుకు అవసరమైన భవనాన్ని నిర్మించారు. అయితే ఈ భవనానికి తలుపులు, కిటికీల ఏర్పాటుతో పాటు కొన్ని సాంకేతిక పనులు మిగిలిపోయాయి. క్రిమిటోరియం యూనిట్‌తో పాటు భవన నిర్మాణం పూర్తి చేసి దానిని ప్రారంభించాలనుకుంటున్న తరుణంలో ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులు అలానే నిలిచిపోయాయి.

స్పందన కరవు

కూటమి ప్రభుత్వం వచ్చి అప్పుడే ఆరు నెలల కాలం దాటుతోంది. ప్రభుత్వానికి గానీ, స్థానిక కూటమి ప్రజా ప్రతినిధులకు గానీ శ్మశాన వాటికలో అసంపూర్తి నిర్మాణంతో నిలిచిపోయిన క్రిమిటోరియాన్ని పూర్తి చేసి పట్టణ ప్రజలకు ప్రయోజనకరమైన ఈ సౌకర్యాన్ని కల్పించే ఆలోచన లేకపోవడం గమనార్హం. గతంలో కోవిడ్ సమయంలో పిట్టలు రాలినట్లు మనుషుల ప్రాణాలు పోతున్నప్పుడు ఆ మృతదేహాలకు శ్మశాన వాటికలో ఎన్ని సమస్యలు ఎదురయ్యాయో, ఎంతటి అసౌకర్యం నెలకొందో ఇక్కడి ప్రజా ప్రతినిధులకు తెలియనది కాదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కోవిడ్ నేర్పిన అనుభవాలతో ప్రతి మున్సిపాలిటీలో శ్మశాన వాటిక పరిధిలో ఓ క్రిమిటోరియం యూనిట్‌కు చర్యలు చేపట్టింది. ఇప్పుడు కోవిడ్ ప్రభావం లేకపోయినప్పటికీ శ్మశానానికి అప్పట్లో మంజూరైన క్రిమిటోరియాన్ని అందుబాటులోకి తెస్తే శవాల దహనం పరంగా సమయం, ఖర్చు ఆదా అయ్యే అవకాశం ఉంటుంది. పట్టణ ప్రజలు కూడా ఇలాంటి సౌకర్యాన్ని కోరుకుంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ స్థానిక ప్రజాప్రతినిధులు ఈ అసంపూర్తి క్రిమిటోరియం యూనిట్ నిర్మాణాన్ని పూర్తి చేసి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు చొరవ చూపాల్సి ఉంది. అదనపు అవసరాల కోసం రూ.20 లక్షల వరకూ వెచ్చిస్తే క్రిమిటోరియం పనులు నూరు శాతం పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ నిధులు త్వరిత గతిన విడుదలయ్యేలా ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. చిత్రమేమిటంటే ఈ పనులు చేపట్టిన పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లు, మున్సిపల్ ఇంజినీర్లు ఆ పనుల బాధ్యత తమది కాదని ఒకరిపై ఒకరు నెపాన్ని నెట్టుకోవడం కొసమెరుపు. కనీసం క్రిమిటోరియం నిర్మాణ వ్యయం ఎంతో కూడా ఇతిమిద్ధంగా తెలియనంత నిర్లక్ష్యంతో అధికారులు ఉండడం గమనార్హం.

త్వరలో పూర్తి చేస్తాం

"కైలాస భూమిలో అసంపూర్తి నిర్మాణంతో ఉన్న క్రిమిటోరియం యూనిట్‌కు అదనపు సౌకర్యాలు సమకూర్చి త్వరలోనే ఆ పనులు పూర్తి చేస్తాం. మిగిలిన పనులకు అవసరమైన నిధులను ఓ ప్రత్యేక గ్రాంటు ద్వారా సేకరించి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం. క్రిమిటోరియం అందుబాటులోకి వస్తే శవాలను దహనం చేసే ప్రక్రియ మరింత సులభతరం అవుతుంది."

– కేవీఆర్ఆర్ రాజు, మున్సిపల్ కమిషనర్, అమలాపురం.

క్లుప్తంగా

రమణారావుకు సత్కారం



కూనవరంలో రమణారావును సత్కరిస్తున్న సర్పంచ్ ఈశ్వరి తదితరులు

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం దేవుని సంఘంలో ఆదివారం అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావును ఘనంగా సత్కరించారు. స్థానిక పాస్టర్ పందు డేవిడ్‌రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా సంఘం తరఫున పేద ప్రజలకు సేవలందిస్తున్న రమణారావుకు సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి, పాస్టర్ డేవిడ్ రాజు, సంఘ పెద్ద వాకపల్లి సత్యనారాయణ, సంఘస్తులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు నగదు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఉప్పలగుప్తం: చదువులో ప్రతిభ చూపుతూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు చిక్కం సరస్వతి, భాస్కరరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. గత ఏడాది పది, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన చిక్కం నాగ వెంకట దీపిక, పాలకొల్లు మేఘన, ఆకుల సాయి మోహిత, కల్వకొలను లక్ష్మీదుర్గ, ఏడిద శ్రీమహాలక్ష్మిలకు ఒక్కొక్కరికీ రూ.2 వేలు చొప్పున నగదును అందించారు. కార్యక్రమంలో చిక్కం సత్యనారాయణ మూర్తి, చిక్కం హరి హరబాబు, చిక్కం ప్రసాద్, చిక్కం పద్మనాభం, చిక్కం పెద్దబ్బులు పాల్గొన్నారు.

సినీ హీరో వరుణ్ తేజ్ జన్మదిన వేడుకలు

అమలాపురం టౌన్: సినీ హీరో వరుణ్ తేజ్ జన్మదిన వేడుకలు కోనసీమలోని అభిమానుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక వెంకటరమణ థియేటర్ వద్ద ఆదివారం ఘనంగా జరిగాయి. థియేటర్ సిబ్బంది సమక్షంలో వరుణ్ తేజ్ జన్మదిన కేక్‌ను కట్ చేసి సిబ్బందికి నూతన వస్త్రాలు బహూకరించారు. కోనసీమ వరుణ్ తేజ్ అభిమానుల సంఘం అధ్యక్షుడు పిండి రాజా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు యేడిద శ్రీను, జిల్లా అధ్యక్షుడు నల్లా చిట్టిబాబు, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ అధ్యక్షుడు నల్లా నాయుడు, థియేటర్ యాజమాని సుబ్బరాజు, అభిమాన సంఘాల ప్రతినిధులు సత్తిబాబు రాజు, లింగోలు కృష్ణ, పోలిశెట్టి రాము, నల్లా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



తాళ్లరేవులో కేవీపీఎస్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న సర్పంచ్‌లు

తాళ్లరేవు: కుల వివక్షతకు వ్యతిరేకంగా 1998లో ఏర్పడిన కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం 25 ఏళ్లుగా అనేక ఉద్యమాలు చేపట్టి విజయం సాధించిందని సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు కెఎస్ శ్రీనివాస్ అన్నారు. కేవీపీఎస్ 2025 క్యాలెండర్, డైరీలను మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, సుంకరపాలెం సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు, పోలేకుర్రు, పి.మల్లవరం, ఇంజరం సర్పంచ్‌లు వెంటపల్లి నూకరాజు, పంపన రామకృష్ణ, ముద్దన వెంకట శివరామప్రసాద్, తాళ్లరేవు మాజీ సర్పంచ్ రెడ్డి రెడ్డిబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోడి భాస్కరరావు తదితరులు ఆవిష్కరించారు. కేవీపీఎస్ పోరాట ఫలితంగా అప్పటి ప్రభుత్వం జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పాటు చేసి దళిత గ్రామాల అభివృద్ధికి సబ్‌ప్లాన్ చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సింహాచలం, విప్పర్తి శ్రీనివాసరావు, పులపకూర గోపాలకృష్ణ, ఐద్వా నాయకురాలు సీహెచ్ రమణి, వెంకటలక్ష్మి, జేబీవీ నాయకులు యుఎస్ఎన్ రెడ్డి, ఎం.రాజశేఖర్, టి.ఈశ్వరరావు, వి.రాజబాబు, ఎలిపే నాగేశ్వరరావు, చల్లా సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

అయినవిల్లి: ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.మనోహర్‌జోషి తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం వీరవల్లిపాలేనికి చెందిన అడపా నాగేశ్వరరావు, అతని భార్య గంగభవాని శనివారం సాయంత్రం మోటార్‌సైకిల్‌పై అమలాపురం వెళ్తున్నారు. మార్గంమధ్యలో విలస కంటి ఆస్పత్రి వద్ద వెనుక నుంచి ఆటో ఓవర్‌టేక్ చేస్తూ వీరి మోటార్ సైకిల్ ఢీకొంది. భార్యాభర్తలిద్దరూ రోడ్డుపై పడిపోయారు. భర్త నాగేశ్వరరావుకు ముఖానికి బలమైన రక్తపు గాయాలయ్యాయి. నాగేశ్వరరావు స్థానికులు, అతని బంధువులు అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

ఘనంగా వేమన జయంతి



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోనసీమ రెడ్డి జన సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: కోనసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వడ్డిగూడెంలోని వేమన కమ్యూనిటీ హాలులో వేమన జయంతి కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. సంఘం అధ్యక్షుడు తేతల సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన జయంతి సభకు సినీ పాటలు, రచయితల పరిశోధన పుస్తకాల రచయిత డాక్టర్ పైడిపాల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగులో వేమన పద్యాలకు ఉన్న ప్రాచుర్యం మరే కవుల పద్యాలకు లేదని డాక్టర్ పైడిపాల గుర్తు చేశారు. వేమన ఓ ప్రజాకవి, సంస్కరణ యోగి, సామాజిక చైతన్య వీచిక అని సంఘ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. సంఘం ప్రతినిధులు కె.శేషారెడ్డి, ఎస్ నారాయణరెడ్డి, గోపాల కృష్ణారెడ్డి, యస్ మందేశ్వరరెడ్డి, పి రాఘవరెడ్డి తదితరులు పాల్గొని వేమన సామాజిక పద్యాలను చదివి వినిపించారు.

ముమ్మిడివరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా గల కళాసాహితీ ఆధ్వర్యంలో ప్రజా కవి వేమన జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేమన చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తన పద్యాల రూపంలో ప్రజా విప్లవాన్ని సృష్టించిన మహోన్నత వ్యక్తి వేమన అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పి విజయకుమార్, మట్టా శ్రీనివాసరావు, నేరేడి మిల్లి అబ్బులు, కవి నాగేంద్ర, విత్తనాల వరప్రసాద్, మెల్లం దుర్గాప్రసాద్, గెద్దం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చౌక డిపో డీలర్ల ఎంపికకు రాత పరీక్ష

- డివిజన్‌లో 103 పరీక్షా కేంద్రాలు
- 184 మంది అభ్యర్థుల హాజరు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో మాధవి, డీఎస్‌వో ఉదయ భాస్కర్ తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న చౌక డిపో డీలర్ల ఎంపికకు రాత పరీక్షను ఆదివారం నిర్వహించారు. డివిజన్ వ్యాప్తంగా 103 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తం 184 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. అమలాపురం పట్టణం వెత్సావారి అగ్రహారంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆర్డీవో కె.మాధవి, డీఎస్‌వో ఉదయ భాస్కర్, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం తదితర అధికారులు తనిఖీ చేశారు. ఖాళీగా ఉన్న చౌక డిపోల్లో డీలర్ల నియామకానికి రాత పరీక్షల ద్వారా ప్రతిభను గుర్తించి అర్హులను ఎంపిక చేస్తామని ఆర్డీవో మాధవి తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు ఆర్డీవో వెంట ఉన్నారు.

అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసన



అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తూ వామ పక్షాల నిరసన ప్రదర్శన

అమలాపురం టౌన్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ అమలాపురంలో సీపీఎం వామ పక్షాల నాయకులు, కార్యకర్తలు ఆదివారం నిరసన తెలిపారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో నిరసన ప్రదర్శన నిర్వహించి అమిత్ షా గో బ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా కేంద్ర మంత్రివర్గంలో ఉండడానికి అనర్హుడని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తదితరులు అమిత్‌షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ ప్రసంగించారు. ఐద్వా నాయకురాలు టి.నాగ వరలక్ష్మి, వామ పక్షాల నాయకులు పీతల రామచంద్రరావు, బుంగ సత్యనారాయణ, తాడి శ్రీరామమూర్తి, సీహెచ్ సూర్య ప్రకాశరావు తదితరులు నిరసనలో పాల్గొన్నారు.

తాళ్లరేవు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేసిన హోంమంత్రి అమిత్‌షా పర్యటనను నిరసిస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక పోస్టాఫీసు వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్, టి.ఈశ్వరరావు, సీహెచ్ రమణి, వల్లు రాజబాబు, రెడ్డిబాబు, ఎలిపే నాగేశ్వరరావు, విప్పర్తి శ్రీనివాస్, టి.రాంబాబు, నల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లారీ, వ్యాన్ ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జయిన వ్యాన్

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు బైపాస్ రోడ్డు ఫ్లైఓవర్‌పై చిట్టిమ్మచెరువు వద్ద ఆదివారం లారీ, వ్యాన్ ఢీకొన్న సంఘటనలో వ్యాన్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. యూరియా బస్తాలతో కాకినాడ నుంచి పేరూరు వై జంక్షన్ వైపునకు వెళుతున్న లారీ, కుట్టు మిషన్ల సామాగ్రితో విజయవాడ నుంచి యానాం వెళుతున్న మినీ వ్యాన్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో వ్యాన్ పూర్తిగా నుజ్జునుజ్జయింది. హైదరాబాద్ కేపీహెచ్‌పీ కాలనీకి చెందిన వ్యాన్ డ్రైవర్ దుప్పళ్ల సాయి ఈశ్వర్ ఇంజిన్‌లో ఇరుక్కుపోయాడు. సర్పంచ్ నక్కా అరుణ కుమారి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావులు సంఘటన స్థలానికి చేరుకొని జేసీబీ సాయంతో వ్యాన్‌ను పెకలించారు. అందులో ఇరుక్కుపోయిన ఈశ్వర్‌ను బయటకు తీశారు. ఈ ప్రమాదంలో అతడి కాలు నుజ్జయింది. మరో కాలికి తీవ్ర గాయాలయ్యాయి. తాలూకా ఎస్సై శేఖర్‌బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడు సాయిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయం ప్రారంభం



ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎం.బాలయోగి తదితరులు

ముమ్మిడివరం: ఏపీటీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) జిల్లా కార్యాలయాన్ని ముమ్మిడిరంలో ఆదివారం విశ్రాంత ఉపాధ్యాయులు ఎం.బాలయోగి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్ఎస్ మున్నేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 22 మండలాలకు చెందిన ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సంబంధించి ఏ సమస్యనైనా ఈ కార్యాలయంలో సంప్రదించి పరిష్కరించుకోవచ్చన్నారు. ఇన్‌కమ్ టాక్స్, పీఎఫ్, ఏపీజీఎల్ఐ వంటి సమస్యలకు కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు నాగాబత్తుల నరసింహమూర్తి, అదనపు కార్యదర్శి గుత్తాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు మోర్త రాజశేఖర్, ఎన్‌వీ రమణ, మడికి నాగభూషణం, పినిపే కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామంలో ఆదివారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. సైకిల్‌పై వెళుతూ రోడ్డు మీద ఆగిన బొంతు రాంబాబు మీద దాడి చేసింది. ఎడమకాలిపై నాలుగు చోట్ల తీవ్రంగా గాయపరిచింది. దీంతో స్థానికులు రాంబాబును నగరం పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పూర్వ విద్యార్థుల కలయిక



మురమళ్ల జెడ్పీ పాఠశాలలో కలుసుకున్న 2007-2008 బ్యాచ్ విద్యార్థులు

ఐ.పోలవరం: మండల పరిధిలోని మురమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 2007–2008 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు స్థానిక పాఠశాల ఆవరణలో ఆదివారం సమావేశమయ్యారు. వివిధ ప్రాంతాలలో స్థిరపడిన దాదాపు 40 మందికి పైగా పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. వీరంతా తాము చదువుకున్న రోజుల నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. ఆట పాటలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. దాదాపు 17 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వీరంతా ఆనందం వ్యక్తం చేశారు.

ర్యాలి ఆలయాన్ని సందర్శించిన జీఎస్టీ ఏసీ



ర్యాలిలో ప్రశాంత్‌కుమార్‌ను సత్కరిస్తున్న దేవస్థానం సిబ్బంది

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసిన జగన్మోహినీ కేశవస్వామి, గోపాలస్వామి వార్లను జీఎస్టీ అండ్ కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ కాకరాల ప్రశాంత్ కుమార్ దర్శించుకున్నారు. స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ సంప్రదాయం ప్రకారం దేవస్థానం అధికారులు, సిబ్బంది, అర్చకులు వారికి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆశీర్వచనం చేయించి స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటం అందచేశారు.

మందకొడిగా దాళ్వా వరి నాట్లు



ముక్కామలలో వరి నాట్లు వేస్తున్న రైతులు

అంబాజీపేట: మండలంలో రబీ నాట్లు మందగొడిగా కొనసాగుతున్నాయి. వాస్తవానికి సంక్రాంతి నాటికి వరి నాట్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా ఇంకా నాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మరో పది రోజుల్లో నాట్లు వేసే ప్రక్రియ పూర్తవుతుందని వ్యవసాయ శాఖాధికారులు అంటున్నారు. సార్వాలో కురిసిన భారీ వర్షాల వల్ల దాళ్వా పంట సాగుపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో ఏటా సంక్రాంతి నాటికి నాట్లు పూర్తి అవుతుండగా రైతుల ఒడిదొడుకుల మధ్య సాగు చేస్తుండడంతో అలస్యానికి కారణమని పలువురు అంటున్నారు. మండల వ్యాప్తంగా 3010 ఎకరాల విస్తీర్ణం దాళ్వా సాగు జరుగుతుండగా ఇప్పటి వరకు కేవలం 650 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ తెలిపారు. మిగిలిన ఎకరాల్లోని నాట్లు పది రోజుల్లో పూర్తవుతాయని చెబుతున్నారు. మండలంలోని రైతులు 120 రోజుల స్వల్ప కాలిక వరి వంగడాలైన పీఆర్ 126, ఎంటీయూ 1121, బొండాలు సాగు చేస్తున్నారని, దీని వల్ల పంట రైతులకు ముందుగానే అందుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

ముగిసిన గ్రామ దేవతల జాతర



మరిడి మహాలక్ష్మి



మహిషాసుర మర్ధిని

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న గ్రామ దేవతలు మరిడి మహాలక్ష్మి, మహిసాసుర మర్ధిని, కనక మహాలక్ష్మి అమ్మవార్ల జాతరలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవార్లకు ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమార్చనలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నైవేద్యాలు సమర్పించి అమ్మవార్లను అందంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కోనసీమ క్రీడోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు



బాలయోగి స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

అమలాపురం రూరల్: జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ పర్యవేక్షణలో ఈ నెల 22 ,23వ తేదీల్లో అమలాపురంలో నిర్వహించ తలబెట్టిన కోనసీమ క్రీడోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆదివారం ఏర్పాట్లను డీఈవో సలీం బాషా, జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ చీఫ్ కోచ్ పీఎస్ సురేష్‌కుమార్, డీవైఈవో జి.సూర్య ప్రకాష్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకునేందుకు క్రీడలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. క్రీడా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడానికి ఆర్డీవో మాధవి, మున్సిపల్ కమిషనర్ పీఆర్ఆర్ రాజు, పీఆర్ డీఈఈ పీఎస్ రాజ్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు, క్రీడాకారులకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లు నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ పోటీలకు 22 జిల్లాల నుంచి 2,600 మంది బాల బాలికలు పాల్గొంటున్నారు.

నాగరత్నం దంపతులకు నివాళులు

అమలాపురం రూరల్: ఇటీవల మృతి చెందిన చిందాడగరువు మాజీ సర్పంచ్ రాజులపూడి నాగరత్నం, ఆమె భర్త కృష్ణమూర్తిలకు పలువురు నాయకులు నివాళులర్పించారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, ఇమ్మిడివరప్పాడు సర్పంచ్ రేలంగి దుర్గారావు, మాజీ సర్పంచ్ రాజులపూడి భీముడు, రాజులపూడి గంగాధర్ రావు, వెంకన్న తదితరులు మాజీ సర్పంచ్ నాగరత్నం చిత్రపటానికి నివాళిలర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తలరాతను మార్చేదే భగవద్గీత



భగవద్గీత పారాయణ చేస్తున్న సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ భక్తులు

అయినవిల్లి: భగవద్గీత పఠనంతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని, భక్తుల తలరాతను మార్చుతుందని అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో ఈ కృష్ణునికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు.

సుందర శ్రీని వాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ హరే కృష్ణ మంత్రం జపించడం మంచిదన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

నెల రోజుల పాటు ఏజీ రోడ్డు మూసివేత

పి.గన్నవరం: అంబాజీపేట–పి.గన్నవరం(ఏజీ) ఆర్అండ్‌బీ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా స్థానిక మూడు రోడ్ల సెంటర్ నుంచి కోకోనట్ కల్యాణ మండపం వరకూ సీసీ రోడ్డు నిర్మించనున్న నేపథ్యంలో సుమారు నెలరోజుల పాటు ఈ రహదారిని మూసివేస్తామని ఆర్అండ్‌బీ డీఈఈ జి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. నాలుగు రోజుల్లో ఈ సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తామని ఆయన వివరించారు. పది మీటర్ల వెడల్పున కిలోమీటర్ పొడవున సీసీ రోడ్డును నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. రూ.8 కోట్లతో ఆధునీకరిస్తున్న ఈ రహదారిలో అంబాజీపేట నుంచి పోతవరం తారు రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఇదిలా ఉండగా పి.గన్నవరం పోలీస్‌స్టేషన్ నుంచి పంచాయతీ రోడ్డులో 150 మీటర్ల మేర, 7 మీటర్ల వెడల్పు సీసీ రోడ్డు పనులను సోమవారం నుంచి ప్రారంభిస్తామని డీఈఈ తెలిపారు.